ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-11-2026 సమయం: సాయంకాలం 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- ప్రజలకు అందే ప్రభుత్వ సేవల్లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లను రేపటిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎన్.యువరాజ్ ఆదేశించారు.

- ప్రజలకు అందుబాటులో ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్.. జాతీయ స్థాయిలో విశిష్ట స్థానాన్ని సాధించిందని ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది.

- జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నిర్వహించారు.

==========

వివిధ శాఖల పని తీరుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యారోగ్యం, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ, జలవనరులు, మెప్మా, సెర్ప్ వంటి శాఖలు క్షేత్రస్థాయిలో అందిస్తున్న సేవలు, ఉద్యోగుల పనితీరుపై అధికారుల సమర్పించిన నివేదికలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అలాగే వివిధ శాఖల పరిధిలోని ఫిర్యాదులను ఏ మేరకు పరిష్కరిస్తున్నారనే అంశంపై ఆయన సమీక్షించారు. ప్రజలకు అందే ప్రభుత్వ సేవల్లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

==========

విశాఖపట్టణంలో ఈ నెల 12, 13వ తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లను రేపటి లోగా పూర్తి చేయాలని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎన్.యువరాజ్ ఆదేశించారు. సదస్సు ఏర్పాట్లపై

విశాఖలో ఆయన ఈరోజు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నిర్మాణాలు, ఫైర్ సేఫ్టీ, విద్యుత్ సరఫరా, ఆడియో సిస్టమ్ తదితర మౌలిక అవసరాలను పోలీసులు తనిఖీ చేసి ధృవ పత్రాలను అందజేయాలని సూచించారు. 11వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దేశ విదేశీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు నగరానికి రానున్నారని, 14 వరకు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 12న సమ్మిట్ ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, పీయూష్ గోయల్ వస్తున్నారని, ముగింపు కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ రానున్నారని చెప్పారు. అలాగే ఇతర దేశాల మంత్రులు, అంబాసిడర్లు, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు విచ్చేస్తున్నారని తెలిపారు. 14న వీఐపీల సందర్శన కోసం గుర్తించిన పర్యాటక ప్రాంతాలు, బీచ్ ల వద్ద విద్యుత్ అలంకరణలు, పూల మొక్కలతో సుందరీకరణ చేయాలని, ఆ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కు సూచించారు.

==========

కొత్త పెన్షన్ విధానంలో ఉన్న అర్హులైన ఉద్యోగులు పాత పెన్షన్ విధానంలోకి మారేందుకు అవకాశం కల్పిస్తూ... రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు జీవో విడుదల చేసింది. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలైన వారికే మాత్రమే ఇది వర్తిస్తుంది. నోటిఫికేషన్ ముందుగా వచ్చి 2004 సెప్టెంబర్ 1 లేదా ఆ తర్వాత అపాయింట్మెంట్ తీసుకున్న వాళ్లు కూడా దీనికి అర్హులని పేర్కొంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారితో పాటు.. రిటైరైన వారు, ఫ్యామిలీ పెన్షనర్లు కూడా ఈ ఆప్షన్ ఎంచుకోవచ్చు. అర్హులైన వారంతా 2026 డిసెంబర్ 31వ తేదీలోగా తమ ఆప్షన్లు సమర్పించాలి. కేంద్ర ప్రభుత్వ నేషనల్ పెన్షన్ సిస్టమ్ మార్గదర్శకాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, కాలపరిమితితో పూర్తి చేసేందుకు సమగ్ర మార్గదర్శకాలు విడుదల చేసింది. దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, పెన్షన్ బెనిఫిట్స్ ఖరారు చేయాలని నియామక అధికారులను ఆర్థిక శాఖ ఆదేశించింది.

==========

ప్రజలకు అందుబాటులో ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో విశిష్ట స్థానాన్ని సాధించింది. యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్ `AEI-2026`లో దేశంలోని 28 రాష్ట్రాల్లో.. ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్స్ స్టడీస్ (CNES) రూపొందించి విడుదల చేసిన ఈ నివేదికపై ముఖ్యమంత్రి కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించింది. ఈ సూచీ రాష్ట్రాల ఆర్థిక సంపదతో పాటు ప్రజలకు దక్కుతున్న సమాన అవకాశాలు, పౌరులకు అవసరమైన సేవలు అందించేందుకు ఆ సంపదను ప్రభుత్వాలు ఎంత సమర్థంగా వినియోగిస్తున్నాయన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించిందని వెల్లడించింది. గోవా మొదటి స్థానంలో నిలవగా.. ఆంధ్రప్రదేశ్ రెండో స్థానాన్ని దక్కించుకుంది.

==========

ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో న్యాయ సేవాధికార సంస్థలు ఉచిత న్యాయ సహాయం, సలహాలు అందిస్తున్నాయని పోలవరం జిల్లా రంపచోడవరం మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ మేజిస్ట్రేట్ ఎం. మురళి గంగాధర రావు అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని రంపచోడవరంలో న్యాయ అవగాహన కార్యక్రమాలు ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర రావు మాట్లాడుతూ... `మీడియేషన్ ఫర్ ది నేషన్ 3.0` కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. న్యాయస్థానాల్లో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు.. ఇరుపక్షాల అంగీకారంతో వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సమాజంలో ప్రతి ఒక్కరూ తమ హక్కులను కాపాడుకుంటూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారు, అర్హులైన పేదలు, గిరిజనులు, మహిళలు, పిల్లలు, సీనియర్ సిటిజన్లు తదితరులు ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

విరామం

==========

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా నీటి ఎద్దడిని నివారించడంతో పాటు సగటు భూగర్భ జలమట్టాన్ని గణనీయంగా పెంచడమే లక్ష్యంగా అధికారులు సమర్థవంతంగా పని చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు `మన్యం వ్యవసాయ గ్రామీణ పరివర్తన ప్రణాళిక` (MART)పై సంబంధిత శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని చెరువులు నూరు శాతం నిండాలన్నారు. గట్టు మీద చెట్టు కార్యక్రమాన్ని మరింత ప్రోత్సహించి, గ్రామాలకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. జిల్లాలో మెడిసినల్ ప్లాంట్స్ సాగు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, 10 వేల ఎకరాల లక్ష్యంగా నిర్దేశించుకోవాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో ఆదర్శ గ్రామాలు రూపుదిద్దుకోవాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని అన్ని వసతి గృహాలు, పాఠశాలల ప్రాంగణాలు పచ్చదనంతో కళకళలాడాలని, విద్యార్థులకు అవసరమైన పంటలు, మొక్కలు ఉండేలా ప్రణాళికలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

==========

పంచాయతీల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 12 మండలాలకు ఒక్కో ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్‌తో కూడిన 12 స్థిర నిఘా బృందాలను (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ - SST) ఏర్పాటు చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఆయా విడతల్లో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన వంటి కార్యక్రమాలను నిర్ణీత తేదీల్లో నిర్వహించనున్నారు. పోలింగ్ రోజున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అక్రమ నగదు, మద్యం, బహుమతుల రవాణాపై నిరంతర నిఘా ఉండాలని, పోలింగ్‌కు ముందు చివరి 72 గంటల్లో, ముఖ్యంగా సున్నితమైన ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని దినేష్ కుమార్ ఆదేశించారు.

==========

గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణల దశలను పారదర్శకంగా చేపట్టాలని శ్రీకాకుళం జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారిణి స్వరూపరాణి స్పష్టం చేశారు. శ్రీకాకుళంలో రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఈరోజు నిర్వహించిన తొలి విడత శిక్షణా శిబిరంలో ఆమె మాట్లాడుతూ... జిల్లాలోని 30 మండలాల పరిధిలో మొత్తం 901 గ్రామ పంచాయతీలు, 8 వేల 548 వార్డులకు ఎన్నికలు సజావుగా సాగేలా పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. సహాయ ఎన్నికల అధికారులుగా వ్యవహరించే తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు.

==========

నూతన సంవత్సరం - 2027ను పురస్కరించుకుని టీటీడీ ప్రచురించిన క్యాలెండర్లు, డైరీలను భక్తులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసేందుకు సదుపాయం కల్పించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈ రోజు ఒక ప్రకటనలో పేర్కొంది. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ttdevasthanams.ap.gov.in ద్వారా 2027 క్యాలెండర్లు, డైరీలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చునని తెలిపింది. అదేవిధంగా.. తిరుపతి, తిరుమల, తిరుచానూరులోని టీటీడీ ప్రచురణల విక్రయ విభాగానికి చెందిన 12 విక్రయ కేంద్రాల్లోనూ ఈ క్యాలెండర్లు, డైరీలు అందుబాటులో ఉన్నాయని.. భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్‌తో పాటు విజయవాడ, చెన్నై, వెల్లూరు, బెంగళూరు, న్యూఢిల్లీ, ముంబై నగరాల్లోని టీటీడీ సమాచార కేంద్రాల్లో కూడా వీటిని విక్రయిస్తున్నారని ఆ ప్రకటనలో తెలిపింది.

==========

బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 21వ తేదీ వరకు `బాల వివాహ ముక్త్ భారత్` 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోందని ఆయన ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు, సిబ్బంది పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఈనెల 27న `బాల్య, బలవంతపు వివాహాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం` సందర్భంగా అన్ని విద్యా సంస్థలు, గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో విస్తృత అవగాహన సదస్సులు, ర్యాలీలు, గ్రామ సభలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

==========

==========